క్లుప్తంగా

ట్రాన్స్‌కో ఏఈ నియామకం

సాక్షి ఎఫెక్ట్..

జైపూర్: మండల విద్యుత్ ట్రాన్స్‌కో ఏఈ సదానందం గత కొన్నినెలలుగా అనారోగ్య కారణాలతో దీర్ఘకాలికంగా సెలవుల్లో ఉండగా విద్యుత్ ట్రాన్స్‌కో ఏఈ లేక రైతులు, వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతుండగా గురువారం 'సాక్షి'లో 'సార్.. కరెంట్ ఏఈ కావాలే' అనే శీర్షికన కథనం ప్రచురించింది. స్పందించిన ఉన్నతాధికారులు జైపూర్ మండల ట్రాన్స్‌కో ఏఈగా జి.మనోహర్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మనోహర్ ఆదిలాబాద్ జిల్లాలో విధులు నిర్వర్తిస్తుండగా మంచిర్యాల జిల్లా జైపూర్ మండల విద్యుత్‌శాఖ ట్రాన్స్‌కో ఏఈగా నియమిస్తూ తెలంగాణ విద్యుత్ డిస్ట్రిబ్యుషన్ కంపెనీ సీఎండీ ఎ.గోపాల్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన త్వరలోనే బాధ్యతలు స్వీకరించనున్నట్లుగా సమాచారం.

26న వాహనాల వేలం

మంచిర్యాలక్రైం: ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు వేలం ద్వారా విక్రయించనున్నట్లు స్థానిక సీఐ నరేందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన 7 ద్విచక్రవాహనాలకు సంబంధించిన వేలం ఈ నెల 26న ఉదయం 10:30గంటలకు స్థానిక ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. వేలంలో పాల్గొని వాహనాలు కొనుగోలు చేయాలనుకునేవారు, స్థానిక ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

బీఎస్పీ టికెట్ కోసం దరఖాస్తు

నెన్నెల: బహుజన్ సమాజ్ పార్టీ బెల్లంపల్లి ఎమ్మెల్యే టికెట్ తనకు కేటాయించాలని నెన్నెల మండలం కోణంపేటకు చెందిన జర్నలిస్ట్ రాంటెంకి శ్రీనివాస్ కోరారు. టికెట్ కోసం ఆయన గురువారం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రజల పక్షాన నిలబడి వారి సమస్యల సాధన కోసం పోరాటం చేస్తున్నట్లు చెప్పారు. డబ్బుల ఆశ చూసి ఓటు వేయకుండా, పనిచేసే వారికే ప్రజలు ఓటు వేస్తారని నమ్మకం తనకు ఉందన్నారు. రాష్ట్ర పార్టీ అధ్యక్షులు ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ తనకే టికెట్ కేటాయిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

చెన్నూర్ విద్యార్థికి ప్రథమ స్థానం



కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న విద్యార్థి

చెన్నూర్: జిల్లా స్థాయిలో ఓటరు అవగాహన కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల్లో చెన్నూర్ మహాత్మ జ్యోతిభాపూలే గురుకుల పాఠశాల విద్యార్థి రాహుల్ ప్రథమ స్థానంలో నిలిచాడని ప్రిన్సిపాల్ కేవీఎం ప్రకాశ్‌రావు తెలిపారు. ఓటరు నమోదుపై జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో పాటల విభాగంలో రాహుల్‌కు మొదటి బహుమతి లభించిందన్నారు. మంచిర్యాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ బదావత్ సంతోశ్ రూ.5వేల నగదు, ప్రశంస పత్రాన్ని అందజేశారు. జిల్లా స్థాయి పోటీల్లో గెలుపొందిన విద్యార్థి రాహుల్‌ను పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించారు.

అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలి

నస్పూర్: పట్టణ పరిధిలోని శ్రీరాంపూర్ ఏరియాలో జరుగుతున్న అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలని ఆమ్‌ఆద్మీ పార్టీ మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి నయీంపాషా గురువారం తెలిపారు. సింగాపూర్ గ్రామ పరిధిలో శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్‌లో మట్టి తవ్వకాల పనులు నిర్వహిస్తున్న జీవీఆర్ కాంట్రాక్ట్ సంస్థ సింగరేణి ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు చేపట్టిందని తెలిపారు. ఈ విషయమై మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

'అరెస్ట్ చేసిన వారిని విడుదల చేయాలి'

మంచిర్యాలక్రైం: లక్సెట్టిపేట మండలం దొడ్డిపెల్లికి చెందిన బండారి ఆనంద్, అరుగుల శ్రీనివాస్‌ను ఈ నెల 19న లక్సెట్టిపేట పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్ట్ చేసిన వారిని వెంటనే విడుదల చేయాలి లేదా కోర్టులో హాజరు పర్చాలని పౌర హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణరావ్, రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇప్పటివరకు కోర్టులో హాజరు పర్చకుండా, విడుదల చేయకపోవడం ఏంటని మండిపడ్డారు. ఇప్పటికైనా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చిన్నయ్య

బెల్లంపల్లిరూరల్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. మండలంలోని లంబాడితండా, గురిజాల, మాలగురిజాల గ్రామాల్లో అభివృద్ధి పనులకు గురువారం భూమిపూజ చేశారు. లంబాడితండాలో రూ.5లక్షల డీఎంఎఫ్‌టీ నిధులతో నూతన సీసీ రోడ్డు, గురిజాలలో రూ.20లక్షల నిధులతో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణం, రూ.20లక్షల నిధులతో నూతన ఆరోగ్య ఉప కేంద్రం నిర్మాణం, రూ.5లక్షల నిధులతో నూతన సీసీ రోడ్డు, రూ.13లక్షల నిధులతో సైడ్ డ్రైన్స్, రూ.2లక్షల నిధులతో హైమాస్ట్ లైట్, మాలగురిజాల గ్రామంలో రూ.20లక్షల డీఎంఎఫ్‌టీ నిధులతో సైడ్ డ్రెయిన్ నిర్మాణ పనులను ప్రారంభించారు. అనంతరం గురిజాలలో ఇతర పార్టీల నుంచి బీఆర్ఎస్ పార్టీలో చేరగా వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సత్యనారాయణ, ఎంపీపీ శ్రీనివాస్, సర్పంచ్‌లు రంజిత, అశోక్, రాయమల్లు, ఎంపీటీసీలు శకుంతల, సుభాష్ రావు, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గణేష్ గౌడ్, కో–ఆప్షన్ సభ్యుడు చాంద్‌పాషా, నాయకులు సత్యనారాయణ, వెంకటేశం, కిరణ్, తాళ్లగురిజాల పీహెచ్‌సీ వైద్యురాలు ఎవంజలీన్, సిబ్బంది, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన మందమర్రి జీఎం

బెల్లంపల్లి: మందమర్రి ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ ఎ.మనోహర్ గురువారం బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యను మర్యాద పూర్వకంగా కలిశారు. ఏఎంసీ ఏరియాలో ఉన్న క్యాంపు కార్యాలయానికి వెళ్లి ఎమ్మెల్యే చిన్నయ్యకు పుష్పగుచ్ఛం అందజేశారు. మందమర్రి ఏరియా జీఎంగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా బెల్లంపల్లికి వచ్చిన జీఎం ఎమ్మెల్యేను కలిశారు. ఏరియా సింగరేణి పరిస్థితుల గురించి జీఎంను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు.

అన్నదానంలో పాల్గొన్న ఎమ్మెల్యే

తాండూర్: మండల కేంద్రంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే చిన్నయ్య పాల్గొన్నారు. శివ గణేష్ వినాయక మండపానికి వచ్చి విఘ్నేశ్వరుడికి పూజ చేశారు.

రైతులను చైతన్యం చేసేందుకు కృషి



రైతులను సన్మానిస్తున్న సత్యనారాయణరెడ్డి

దండేపల్లి: వ్యవసాయ రంగంలో మార్పులు తేవడంతో పాటు, రైతులకు సాగులో మెళుకువలు, ఆధునిక వ్యవసాయం, తదితర విషయాల్లో అవగాహన సదస్సులు నిర్వహించి రైతులను చైతన్యం చేసేందుకు భారతీయ కిసాన్ సంఘ్ కృషి చేస్తుందని సంఘ్ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని తాళ్లపేటలో గురువారం రైతు దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో సమావేశం నిర్వహించారు. అనంతరం పలువురు రైతులను సన్మానించారు. కార్యక్రమంలో రైతులు లక్ష్మణ్, రామన్న, స్వామి, పోషన్న, రామయ్య, శ్రీనివాస్, రాకేష్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జనం ఏర్పాట్లపై పరిశీలన



ఏర్పాట్లపై చర్చిస్తున్న ఆర్డీవో, ఏసీపీ

బెల్లంపల్లి: వినాయక నిమజ్జనం ఏర్పాట్లపై గురువారం ప్రభుత్వ శాఖల అధికారులు సమాలోచనలు చేశారు. బెల్లంపల్లి ఆర్డీవో కె.సురేష్, ఏసీపీ పంతాటి సదయ్య ఇతర అధికారులతో కలిసి పోచమ్మ చెరువు వద్దకు వెళ్లి నిమజ్జనం జరిగే ప్రదేశాన్నీ పరిశీలించారు. చెరువు వద్ద క్రేన్స్, ఫెన్సింగ్, పారిశుధ్యం పనుల నిర్వహణ, లైటింగ్ తదితర సౌకర్యాలను ఏర్పాటు చేయాలని సమీక్షించారు. ఇతర శాఖల అధికారులను సమన్వయం చేసుకుని ఏర్పాట్లలో లోటు లేకుండా చూడాలని ఆదేశించారు. ఆర్డీవో, ఏసీపీ వెంట మున్సిపల్ కమిషనర్ కె.సమ్మయ్య, వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ టి.శంకరయ్య, తహసీల్దార్ సుధాకర్ ఉన్నారు.

రక్తదాన శిబిరం నిర్వహించాలని వినతి



ఎస్ఈకి వినతిపత్రం ఇస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులు

మంచిర్యాలటౌన్: ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బ్లడ్ బ్యాంకులో రక్త నిల్వలు పూర్తిగా తగ్గిపోయాయని రక్తదాన శిబిరాన్ని నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు గురువారం విద్యుత్‌శాఖ ఎస్ఈ శేషరావుకు వినతిపత్రం అందించారు. తలసేమియా, సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తులు, ప్రభుత్వ ఆసుపత్రిలోని గర్భిణులు, డయాలసిస్ రోగులకు రక్తం అందక ఇబ్బంది పడుతున్నారని, సీజనల్ వ్యాధులతో రక్తకణాలు తగ్గుముఖం పట్టడం, రక్తహీనత వంటి వాటితో ఇబ్బందులు పడుతున్నారని వారికి రక్తం అందించేందుకు సహకరించాలని కోరారు. ఇందుకు ఎస్ఈ స్పందించి త్వరలోనే విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కంకణాల భాస్కర్ రెడ్డి, జిల్లా కోశాధికారి పడాల రవీందర్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



గణేష్ (ఫైల్)

కాసిపేట: మండలంలోని దేవాపూర్‌కు చెందిన చునార్కర్ గణేష్(21) అనే యువకుడు జ్వరంతో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, స్థానికుల కథనం ప్రకారం.. గణేశ్ జ్వరంతో బాధపడుతూ బ్లడ్ బ్రెయిన్‌కు ఎక్కడంతో వారం రోజులుగా మంచిర్యాలలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పరిస్థితి విషమించడంతో గురువారం మృతి చెందాడు. మృతుడి తండ్రి రాజేష్ ఓరియంట్ ఆస్పత్రిలో అటెండర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు.

మద్యానికి బానిసై సింగరేణి ఉద్యోగి ఆత్మహత్య

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని లక్ష్మినగర్‌కు చెందిన సింగరేణి ఉద్యోగి మహ్మద్ చాంద్ ఖాన్ తాగుడుకు బానిసై ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానిక ఎస్సై జగదీష్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఎండీ చాంద్‌ఖాన్(45) రోజూ మద్యం తాగి ఇంట్లో గొడవ పడుతూ, తరచూ నేను చనిపోతానని కుటుంబ సభ్యులను బెదిరించేవాడు. ఎప్పటిలాగానే బుధవారం రాత్రి మద్యం తాగిన మత్తులో సీలింగ్ రాడ్‌కు నవార్ తాడుతో ఉరి వేసుకొన్నాడు. చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. ఖాన్‌కు భార్య రఫియ బేగం, ముగ్గురు కూతుర్లు ఉన్నారు. రఫియాబేగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని నిరసన



నస్పూర్: రాస్తారోకో నిర్వహిస్తున్న నాయకులు



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

నస్పూర్: ప్రస్తుతం జరుగుతున్న ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ శ్రీరాంపూర్‌లోని జాతీయ రహదారిపై ఎమ్మార్పీఎస్ నాయకులు రాస్తారోకో చేశారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తామని బీజేపీ పెద్దలు, కేంద్ర మంత్రులు గతంలో అనేక మార్లు హామీ ఇచ్చారని ఆరోపించారు. ప్రస్తుత సమావేశాల్లో వర్గీకరణ బిల్లు పెట్టి చట్టబద్ధత కల్పించాలని, లేనియెడల రాబోయే ఎన్నికల్లో బీజేపీకి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సందిల్ల మల్లేశ్ మాదిగ, జిల్లా ఉపాధ్యక్షుడు జలంపల్లి శ్రీనివాస్ మాదిగ, నాయకులు గుంపుల స్వామి, మొగిళి చంద్రయ్య, లింగంపల్లి స్వామి, తదితరులు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని పాత బస్టాండ్ కూడలి వద్ద ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు జేడి సారంగం ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెన్నూరి సమ్మయ్య హాజరై రోడ్డుపై టైర్లు కాల్చి నిరసన వ్యక్తం చేశారు. జాతీయ రహదారిపై సుమారు గంటపాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఈ సందర్భంగా సమ్మయ్య మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ విషయంలో నాన్చుడు దోరణి వ్యవహరిస్తుందని మండిపడ్డారు. పార్లమెంట్‌లో వర్గీకరణ బిల్లు ప్రవేశ పెట్టకుంటే వచ్చే ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెపుతామని హెచ్చరించారు. నిరసన కారులతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిన విషయం తెలుసుకున్న సీఐ మహేందరరెడ్డి అక్కడకు చేరుకుని నిరసన కారులను తొలగించి, ట్రాఫిక్ క్లియర్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పెర్క నర్సయ్య, శ్రీనివాస్, రాజ్‌కుమార్, పూర్ణచందర్ తదితరులు ఉన్నారు.

ఘనంగా కొండా లక్ష్మణ్ వర్ధంతి



దండేపల్లి: లక్ష్మణ్ చిత్రపటం వద్ద నివాళి

దండేపల్లి/రామకృష్ణాపూర్/పాతమంచిర్యాల/జన్నారం/జైపూర్: జిల్లా వ్యాప్తంగా ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని గురువారం పద్మశాలీ కులస్తుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘం నాయకులు పాల్గొన్నారు.

'కేంద్ర ప్రభుత్వ నిధులతో గ్రామాలాభివృద్ధి'



బట్టలు అందజేస్తున్న వివేక్

లక్సెట్టిపేట: కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులతోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎంపీ వివేక్ అన్నారు. లక్సెట్టిపేట మండలం తిమ్మాపూర్‌లో గురువారం వెరబెల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చీరల పంపిణీ కార్యక్రమానికి వెరబెల్లి రఘునాథ్‌తో కలిసి ఆయన చీరలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామాలకు నిధులు మంజురు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పుర్తిగా విఫలమైందన్నారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులతోనే అభివృద్ధి జరుగుతుందన్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే పల్లెలు మరింత భాగుపడుతాయన్నారు. కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు బొప్పు కిషన్, నాయకులు నాగిరెడ్డి, సత్యనారాయణ రెడ్డి, చిన్నయ్య, శ్రీనివాస్, సత్తన్న, మధు, శ్రీరాం తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ నూతన కార్యవర్గం ఎన్నుకోవాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న సొసైటీ చైర్మన్ భాస్కర్ రెడ్డి

మంచిర్యాలటౌన్: జిల్లా రెడ్‌క్రాస్ నూతన కార్యవర్గ సభ్యుల ఎన్నిక ప్రక్రియను చేపట్టేందుకు వార్షిక సర్వసభ్య సమావేశం నిర్వహించేలా చూడాలని కోరుతూ రెడ్‌క్రాస్ చైర్మన్ కంకణాల భాస్కర్ రెడ్డి, కోశాధికారి పడాల రవీందర్ గురువారం రెడ్‌క్రాస్ జిల్లా వైస్ ప్రెసిడెంట్, అదనపు కలెక్టర్ బి.రాహుల్‌కు వినతిపత్రం అందించారు. రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకు శిథిలావస్థకు చేరి, వర్షం కురిస్తే స్లాబుల నుంచి వరద నీరు కారి, పరికరాలు చెడిపోతున్నాయని వాపోయారు. బ్లడ్ బ్యాంకుకు స్థలం కేటాయించడం లేదా వేరే వసతిని కల్పించేలా చూడాలని, జనరిక్ మందుల షాప్‌ను ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేస్తే, ప్రజలకు తక్కువ ధరల్లో మందులు లభిస్తాయని తెలిపినట్లు చెప్పారు.

గొర్రెల దాణా పంపిణీ

భీమారం: యాదవులకు రాష్ట్రప్రభుత్వం అండగా నిలుస్తోందని జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార సంఘం చైర్మన్ కొమ్ము అశోక్‌యాదవ్ పేర్కొన్నారు. గొర్రెలకు ఆహారం అందించేందుకు మంజూరైన దాణా బస్తాలను గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పంపిణీ చేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం గొర్రెలను సబ్సిడీపై అందించడమే కాక, పశుసంవర్ధక శాఖ ద్వారా వాటి బాగోగులు చూస్తుందన్నారు. ముఖ్యంగా వాటికి వ్యాధులు సోకిన వెంటనే, చికిత్స అందించడంతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పశువైద్యాధికారి రాకేష్‌శర్మ, యాదవులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



దండేపల్లి: మండలంలోని మదర్‌థెరిస్సా పాఠశాలకు చెందిన లాస్య, రిషిత, శ్రీజ, నైతిక, మనీషా, శ్రేష్ఠ, అమూల్య, శ్రీనిధి, సిద్ధార్థ, విశాల్, యూనిషా విద్యార్థులు రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలకు ఎంపికయ్యారని ఫాదర్ జోబి, పీఈటీ రాజేశం తెలిపారు. ఈ నెల 22 నుంచి వరంగల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



జీఎం ఆఫీస్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

మందమర్రిరూరల్: సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని గురువారం జీఎం ఆఫీస్ ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం ఏరియా పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి అక్బర్‌అలీ మాట్లాడుతూ.. పెండింగ్ సమస్యలు పరిష్కరించడంలో యాజమాన్యం మొండి వైఖరి అవలంభిస్తోందని ఆరోపించారు. వెంటనే పరిష్కరించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ, నాయకులు మల్లేష్, ఆంజనేయులు, లింగయ్య, ప్రభాకర్, రాజ్‌కుమార్, సతీష్, కొమురయ్య, కాంట్రాక్ట్ కార్మికులు ఉన్నారు.

జీఎం కార్యాలయం ముట్టడి

నస్పూర్: సింగరేణి సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) నాయకులు శ్రీరాంపూర్ జీఎం కార్యాలయాన్ని గురువారం ముట్టడించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించాలని, జీఓ నంబర్ 22ని కార్మికులకు వర్తింపజేయాలని, ప్రతీ నెల 7న జీతాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి వీరభద్రయ్య, నాయకులు ముస్కె సమ్మయ్య, రవీందర్, చంద్రమోహన్, రాజు, ప్రభాకర్, వీరేశం తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగుల సంబురాలు

నస్పూర్: చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ లోక్‌సభలో బిల్లు ప్రవేశపెట్టడంపై శ్రీరాంపూర్ ఏరియాలోని సింగరేణి మహిళా ఉద్యోగుల సంబురాలు చేసుకున్నారు. సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్లో మహిళా ఉద్యోగులతో కలిసి సేవా సమితి అధ్యక్షురాలు రాధాకుమారి కేక్ కట్ చేశారు. డీజీఎంలు అరవిందరావు, చిరంజీవులు, అధికారులు కాంతారావు, వరలక్ష్మి, స్వప్న, ప్రంబంధిత, ఆకుల అఖిల పాల్గొన్నారు.

■ బొగ్గుబాయి వార్తలు

ఆర్కే 5 గనిపై నిరసన

నస్పూర్: సింగరేణిలోని హై స్కిల్డ్ ఉద్యోగాలలో ఔట్ సోర్సింగ్ ద్వారా నియామకాలు చేపట్టడాన్ని నిరసిస్తూ ఆర్కే 5గనిపై గని స్టాఫ్ గురువారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. అనంతరం గని మేనేజర్ అబ్దుల్ ఖాదీర్‌కి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సూపరింటెండెంట్ మధునయ్య, ఆఫీస్ స్టాఫ్ లక్ష్మీపతి, గౌస్, శ్రీకాంత్, సురేశ్, సాయికృష్ణ, కులకర్ణి, సందీప్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'ఏరియర్స్ అందించడం సంతోషకరం'

జైపూర్: మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటులతో అత్యధికంగా ఏరియర్స్ అందుకున్న ఉద్యోగులను సన్మానించారు. ఈ సందర్భంగా స్థానిక అడ్మిన్ భవన కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్టీపీపీ నుంచి అత్యధికంగా ఏరియర్స్ అందుకున్న లలితాకుమారి, చుక్కల శ్రీనివాస్, సత్యనారాయణను సన్మానించారు. కార్యక్రమంలో ఎస్టీపీపీ సీటీసీ సంజయ్‌కుమార్ సూర్, జీఎం బసివిరెడ్డి, అధికారులు విశ్వనాధరాజు, సుధాకర్, నారాయణరావు, రామశాస్త్రి పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె

భీమిని/నెన్నెల/దండేపల్లి: అంగన్‌వాడీ సిబ్బంది నిరవధిక సమ్మె కొనసాగుతోంది. తమ సమస్యలు పరిష్కరించాలంటూ నిరసన చేపడుతున్నారు. గురువారం కన్నెపల్లి మండలంలో వర్షంలో సైతం నిరసన చేపట్టారు. నెన్నెలలో రాస్తారోకో నిర్వహించారు. సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు మద్దతు తెలిపారు. దండేపల్లిలో గొడుగులు పట్టుకుని నిరసన తెలిపారు.

'ప్రభుత్వం నిర్లక్ష్యంతో అనారోగ్యం బారిన పేదలు'

కాసిపేట: ప్రభుత్వ నిర్లక్ష్యంతో పేదలు అనారోగ్యం పాలవుతున్నారని, తూతూ మంత్రంగా వైద్యసేవలు నిర్వహిస్తుండగా జిల్లా యంత్రాంగం సమీక్షలకే పరిమితం అవుతుందని సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి విమర్శించారు. మండలంలోని రొట్టెపల్లి, కోలాంగూడ, సోనాపూర్, బాదుగూడ, దొడ్డిగూడెం, జెండగూడెం, సాలేగూడెం, దేవాపూర్, పెద్దగూడెం తదితర గ్రామాల్లో గురువారం సీపీఎం బృందం పర్యటించారు. గూడాలలో ఆదివాసీలు 20రోజులుగా జ్వరాలతో బాధపడుతున్నా, ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. వెంటనే వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి మెరుగైన వైద్యం అందించి, పారిశుధ్య పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు దూలం శ్రీనివాస్, మండల నాయకులు సిడం జంగుబాయి తదితరులున్నారు.

'కొనుగోలు చేసిన భూమిపై ఆరోపణలు సరికాదు'

కాసిపేట: నలుగురు పెద్దల సమక్షంలో కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్న భూమిని లాక్కున్నట్లు ఆరోపించడం సరికాదని ఉప్పులేటి శ్రీనివాస్ దంపతులు తెలిపారు. ముత్యంపల్లికి చెందిన బరిగెల ఆశాలు తన నాలుగు ఎకరాల భూమిని తెలియకుండా పట్టా చేయించుకున్నాడని చేసిన ఆరోపణలను ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఖండించారు.

'డీజే' నిర్వాహకుల బైండోవర్

బెల్లంపల్లి: ప్రజా శాంతికి భంగం కలిగిస్తున్న ఐదురుగు డీజే సౌండ్స్ నిర్వాహకులను పోలీసులు బైండోవర్ చేశారు. బెల్లంపల్లి వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ శంకరయ్య తెలిపిన వివరాల ప్రకారం.. పర్వదినాలు, శుభకార్యాలు, ఊరేగింపులకు డీజే సౌండ్స్‌ను అద్దెకు ఇచ్చి ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్న ఆసాది సరేష్, ఉదురు కోట రాజేందర్, కుశ్నపల్లి రాజేందర్, ఎండి అబ్దుల్ జబీ, షేక్ రఫీలను గురువారం బెల్లంపల్లి మండల తహసీల్దార్ సుధాకర్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్‌హెచ్‌ఓ తెలిపారు. ఆరు నెలల వ్యవధిలో సౌండ్ పొల్యూషన్‌కు పాల్పడితే చట్టపరంగా రూ.2లక్షల జరిమానా లేదా జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తహసీల్దార్ హెచ్చరించారు. ఈ మేరకు నిర్వాహకులను సొంతపూచీకత్తుపై విడుదల చేశారు.

మహిళా రిజర్వేషన్ బిల్లును సవరించాలి

పాతమంచిర్యాల: కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న 33శాతం మహిళా రిజర్వేషన్ బిల్లును సవరించాలని ధర్మసమాజ్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో గురువారం మహిళా రిజర్వేషన్ బిల్లు దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు.

సీతారామ గణేశ్ మండలి వద్ద పూజలు

చెన్నూర్: పట్టణంలోని సీతారాంతోట కాలనీలోని సీతారామ గణేశ్ మండలి వద్ద గురువారం అర్చకులు రాజగోపాల్ ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేక పూజ లు నిర్వహించారు.

ప్రభుత్వాసుపత్రి సందర్శన

బెల్లంపల్లి: వైద్యం కోసం ప్రభుత్వాసుపత్రికి వస్తున్న రోగులు సరిపడా వైద్యులు, సిబ్బంది లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ విమర్శించారు. బెల్లంపల్లి ప్రభుత్వాసుపత్రిని గురువారం సందర్శించి సమస్యల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు.